

లోకేశ్ పర్యటన ఇలా..

బొబ్బిలి : టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ బుధవారం సాయంత్రం బాడంగిలో శంఖారావం సదస్సుకు వస్తున్నారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పార్వతీపురం మండలం వెంకంపేటలో పర్యటిస్తారు. అక్కడి సభ ముగిశాక సాలూరు 12వ వార్డు సదస్సులో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటల తర్వాత బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని బాడంగి సమావేశానికి బయలుదేరి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. సదస్సు పిన్నవలస రోడ్డు జంక్షన్‌లో జరుగనుంది. రాత్రి 7.40 గంటలకు సదస్సు ముగించుకొని రాజాం వెళ్లి అక్కడే రాత్రి బస చేస్తారు.

- స్థానిక సమస్యలే యువనేత అజెండా
- ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతల ఆగడాలను ఎండగట్టనున్న లోకేశ్
- ఐదేళ్ల పాలనలో ప్రజా వ్యతిరేక విధానాలపై విమర్శనాస్త్రాలు
- టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి మేలు చేస్తుందో స్పష్టత
- నేడు బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో శంఖారావం సభ

శంఖారావం.. సర్వ సన్నద్ధం



(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన శంఖారావం యాత్రకు సర్వం సిద్ధమైంది. బొబ్బిలి నియోజకవర్గం బాడంగి మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక నుంచి యువనేత లోకేశ్ ప్రసంగించనున్నారు. ఇప్పటికే యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ ప్రజల్లోకి దూసుకు పోయారు. భోగాపురం మండలంలో యువగళం పాదయాత్ర ముగింపు సభకు లక్షలాది మంది హాజరైన విషయం తెలిసిందే. అది విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడిచింది. వచ్చే ఎన్నికల్లో మార్పు అనివార్యమన్న సంకేతాన్ని ఇచ్చింది. అదే ఉత్సాహాన్ని శ్రేణుల్లో నింపుతూ .. జనంలో ఉండాలని కంకణం కట్టుకున్న లోకేశ్ మూడు రోజుల కిందట శంఖరావం యాత్రకు ఉత్తరాంధ్ర నుంచే శ్రీకారం చుట్టారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి యాత్ర ప్రారంభించారు. నాలుగో రోజులో భాగంగా బుధవారం బొబ్బిలి నియోజకవర్గం బాడంగి మండలానికి వస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. సభకు పెద్ద సంఖ్యలు కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరుకానున్నారు.

స్థానిక సమస్యలే అజెండా

లోకేశ్ తన శంఖారావం యాత్రలో స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులను అర్ధాంతరంగా విడిచి పెట్టడం.. జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడం.. బిల్లులు చెల్లించక ఆగిన అభివృద్ధి పనులు... యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడం తదితర అంశాలపై ఆయన మాట్లాడుతున్నారు.

పరిశ్రమలు మూత

జిల్లాకు ఒక్క పరిశ్రమనూ స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రి తీసుకు రాలేకపోయారు సరికదా ఉన్న వాటిని నడిపించలేకపోయారు. బొబ్బిలి సమీపంలోని లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారాన్ని మూత వేయించారు. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని జామి మండలం భీమసింగి సహకార చక్కెర కర్మాగారాన్ని ఆధునీకీకరణ పేరుతో మంత్రి బొత్స ఆపేశారు. ఎల్లాయిస్ పరిశ్రమలు మూత పడ్డాయి. జూట్ పరిశ్రమలదీ అదేదారి. పరిశ్రమలు ఎత్తివేతతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయి.

ఎమ్మెల్యే వైఫల్యాలు

- బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అసెంబ్లీలో ఎత్తిపోతల పథకాల గురించి ప్రస్తావించడం.. సీఎం కనీసం స్పందించకపోవడం పరిపాటిగా మారింది.
- తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వపై రెండు ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు నెరవేర్చలేదు.
- వెంగళరాయ సాగర్ సాగునీటి ప్రాజెక్టు ద్వారా అదనపు ఆయకట్టుకు సాగునీరు ఇప్పటికీ దక్కలేదు.
- బొబ్బిలి-రామభద్రపురం మధ్య ప్రవహిస్తున్న పారాది వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణ పనులు చేపట్టలేకపోయారు.
- బొబ్బిలి-సీతానగరం మధ్య ప్రవహిస్తున్న సువర్ణముఖీ నదిపై వంతెన నిర్మాణ పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పారిపోయాడన్న ఆరోపణ ఉంది.
- జగనన్న ఇళ్ల స్థలాల భూసేకరణలో బొబ్బిలి ప్రాంతంలో పెద్ద గోల్ మాల్ జరిగింది. ఓ అధికార పార్టీ నాయకుడు తక్కువ ధరకు పేద రైతుల వద్ద కైవసం చేసుకుని రెట్టింపు ధరలకు ప్రభుత్వానికి అంటగట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి.

బొత్సకు భూ కేటాయింపు

బొబ్బిలిలో గ్రోత్‌సెంటర్ టీడీపీ హయాంలో ఏర్పాటైంది. అప్పట్లోనే అనేక పరిశ్రమలు వచ్చాయి. అయితే భూ కేటాయింపులు చేసి పరిశ్రమలు స్థాపించని వారిపై వైసీపీ ప్రభుత్వ నేతలు కన్నేశారు. అంతే వారికి నచ్చని వారిని ఖాళీ చేయించి భూములను స్వాధీనం చేసుకున్నారు. 30 ఎకరాలు మంత్రి బొత్స సత్యనారాయణకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు ధారాదత్తం చేసిందన్న ఆరోపణ ఉంది.

- బాడంగిలో జరగనున్న లోకేశ్ శంఖారావంలో బుధవారం ఆయన సమక్షంలో బొబ్బిలి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ పర్లాపు చంద్రశేఖర్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరనున్నారు.

ఏర్పాట్లను సమీక్షించిన బేబీనాయన

బాడంగి: లోకేశ్ బహిరంగ సభ ఏర్పాట్లపై బొబ్బిలి టీడీపీ ఇన్‌చార్జి బేబీనాయన మంగళవారం తెంటు బంగ్లాలో సమీక్ష నిర్వహించారు. వాహనాల పార్కింగ్, సభా స్థలం అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షించాలన్నారు. సమీక్షలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు కూడా పాల్గొన్నారు.





బాడంగి సమీపాన పిన్నవలస రోడ్డు జంక్షన్‌లో సభ జరగనున్న స్థలం

కోలగట్లకు భారీ షాక్



రాజీనామా పత్రాలతో వైసీపీ నాయకులు

- విజయనగరంలో అధికార పార్టీకి ఎదురు దెబ్బ
- పార్టీని వీడుతున్నట్లు వెల్లడించిన ముఖ్య నాయకులు
- అధినాయకత్వానికి పోస్టులో రాజీనామా లేఖలు
- డిప్యూటీ స్పీకర్ వీరభద్రస్వామి వైఖరే కారణమని ధ్వజం
- మాన్సాస్ భూములను కొల్లగొట్టాలనుకున్నారని తీవ్ర ఆరోపణ
- డిప్యూటీ మేయర్ పదవిని కుమార్తెకు కట్టబెట్టారని మండిపాటు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి భారీ షాక్ తగిలింది. నగరానికి చెందిన ముఖ్య నేతలు పార్టీని వీడుతున్నట్లు మంగళవారం ప్రకటించారు. వైసీపీ అంటే కోలగట్ల ఫ్యామిలీయేనని, ఆయన తీరు వల్లే పార్టీని వీడుతున్నామని అవనాపు విజయ్, పిళ్లా విజయ్‌కుమార్ అన్నారు. చీమలు పెట్టిన పుట్టల్లోకి పాములు దూరాయని, మొదటినుంచి వైసీపీకి సేవలందించిన వారికి గౌరవం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలాజీనగర్‌లోని విజయ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తాము ఒక నియంత వల్ల పార్టీని వదులుకోక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ ఉన్నప్పటికీ ఆయన ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయారన్నారు. అనేక పర్యాయాలు అధిష్ఠానం దృష్టికి, జిల్లా పెద్దల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు సమన్వయ పరిచే చర్యలేవీ తీసుకోలేదని నిరాశ వ్యక్తం చేశారు. జగన్మోహన్‌రెడ్డి పార్టీని పెట్టినప్పుడు ఆ పార్టీకి తొలుత అండగా నిలిచింది అవనాపు సూరిబాబేనని, ఓదార్పు యాత్ర చేపట్టినప్పుడు కూడా అవనాపు కుటుంబీకులే అన్నీతామై చూశారన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి పార్టీలో చేరతారని జగన్మోహన్‌రెడ్డి తమతో చర్చించినప్పుడు తామూ ఆహ్వానించామని, పార్టీలోకి వచ్చిన తరువాత ఆయన తమను పక్కను పెట్టడం ప్రారంభించారని, అనేక విధాలుగా అవమానపరిచారని అన్నారు. ఇంత కాలం ఓపిక పట్టామని, ఇక పార్టీలో ఉండడం మంచిది కాదని భావించి సీఎం జగన్, వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యన్నారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిన్నశ్రీనుకు పోస్టు ద్వారా రాజీనామా లేఖలను పంపించామని తెలిపారు.

- ఎమ్మెల్యే కోలగట్ల తీరులో ఎటువంటి మార్పు రావడంలేదని, కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ పదవిని దళిత సామాజిక వర్గానికి కేటాయించాలని అధిష్టానాన్ని కోరగా ఆ పదవిని తన కుమార్తెకు కట్టబెట్టారన్నారు. ఏ కార్పొరేటర్‌కూ ఎటువంటి అధికారం లేదని.. వారి, వారి డివిజన్లలో కుళాయి కనెక్షన్ ఇవ్వాలన్నా ఎమ్మెల్యే కోలగట్లని సంప్రదించాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు. అన్నింటా ఎమ్మెల్యే అల్లుడు కమీషన్ తీసుకుని పనులు చేయిస్తున్నారన్నారు. ప్రాంతాల వారీగా విజయనగరాన్ని విభజించి వారి కుటుంబీకులను ఆ ప్రాంతాలకు సామంతులను చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.
- మాన్సాస్ ట్రస్టు విషయంలో తలదూర్చవద్దని సాక్షాత్తు మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పినా వినకుండా ఆ సంస్థ భూములను సొంతం చేసుకునేందుకు మాన్సాస్ కమిటీలోకి చొరబడ్డారన్నారు. అందులో భాగంగా ఆనందగజపతిరాజు తొలి భార్య కుమార్తెను తీసుకువచ్చి మాన్సాస్‌కి ఛైర్మన్ చేశారన్నారు. చివరికి న్యాయం గెలిచి అశోక్‌గజపతిరాజు ఛైర్మన్ అయ్యారన్నారు. విజయనగరంలో సామాజిక సాధికార యాత్ర నిర్వహించలేదంటే స్థానిక ఎమ్మెల్యేకి బీసీలు, ఎస్సీలు అంటే ఎంత చులకనో అర్థమౌతుందన్నారు. మరో నాలుగు రోజుల్లో తమ నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కొళాయి కోసం రోడ్డు ధ్వంసం

పాత అలుగుబిల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కొళాయి ఇచ్చేందుకు పైపులు వేయడానికి సిమెంట్ రోడ్డును తవ్వేసిన దృశ్యమిది. జిల్లాలో చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వేసిన సిమెంట్ రోడ్లకు ఇరువైపులా అంచు పగలగొడుతున్నారు. దీనివల్ల కొన్ని గ్రామాల్లో సగం రోడ్డు ధ్వంసం అవుతోంది. ఆ తర్వాత ఆ రోడ్డుపై టూ వీలర్ వెళ్లడానికి కూడా ఇబ్బంది అవుతోంది. ఇదేం అభివృద్ధి అని సీనియర్ సిటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

- శృంగవరపుకోట రూరల్

సీఎం విశాఖ వచ్చినా చింతేనా?



బస్సుల్లేక వెలవెలబోతున్న విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్

- ముఖ్యమంత్రి సభకు బస్సులు... ప్రయాణికులకు తిప్పలు
- ఉమ్మడి జిల్లాలో 150 ఆర్టీసీ సర్వీసుల తరలింపు
- విజయనగరం కాంప్లెక్స్‌లో గంటల పాటు నిరీక్షించిన ప్రయాణికులు

(విజయనగరం రింగురోడ్డు)

పక్క జిల్లాకు సీఎం వచ్చినా చింత తప్పలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముఖ్య అతిథిగా విశాఖలో మంగళవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర ముగింపు సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆర్టీసీ సర్వీసులు తరలించారు. దీంతో మంగళవారం అన్ని చోట్లా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడడం కనిపించింది. ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా బస్సులు రద్దు చేశారు. ఆ బస్సుల కోసం వచ్చిన ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. విధిగా సమయానికి వారు కళాశాలలకు చేరాలి. ఉదయం 5గంటలు, 6గంటలకు ప్రారంభం అయ్యే సర్వీసుల కోసం ఉద్యోగులు, ప్రయాణికులు విజయనగరం కాంప్లెక్స్‌కు భారీగా చేరుకున్నారు. ఎప్పటికీ సర్వీసులు రాకపోవటంతో ఆర్టీసీ సిబ్బంది వద్ద వాకబు చేశారు. చాల బస్సులు రద్దు చేసినట్లు సమాచారం తెలుసుకుని అవాక్కయ్యారు. ముందస్తు సమాచారం లేదు సరికదా కాంప్లెక్స్ వద్ద సర్వీసులు రద్దు అయ్యాయని చెప్పే నాథుడు కూడా లేడు.

విజయనగరం డిపో నుంచి 30 ఆర్టీసీ బస్సులు తరలించారు. ఎస్.కోట డిపోనుంచి 30 బస్సులు కేటాయించారు. సాలూరు డిపో నుంచి 30, పాలకొండ డిపో నుంచి 30, పార్వతీపురం డిపో నుంచి 28 బస్సులు జనం తరలించేందుకు వినియోగించారు. ఒకే సారి ఎక్కువ సర్వీసులు తగ్గిన కారణంగా ప్రయాణికుల అవస్థలకు అవధులు లేకుండా పోయాయి.

లోకేష్ సభకు భారీగా తరలిరండి

● శంఖారావాన్ని విజయవంతం చేయండి
● కార్యకర్తలను, శ్రేణులను కోరిన టీడీపీ నాయకులు


విజయనగరం: మాట్లాడుతున్న అదితి గజపతిరాజు


ఎల్‌కోట: మాట్లాడుతున్న కేబీఏ రాంప్రసాద్


కొత్తవలస: మాట్లాడుతున్న లలిత కుమారి


ఎస్‌కోట: మాట్లాడుతున్న గొంప కృష్ణ

విజయనగరం రూరల్: అరాచక పాలనపై నారా లోకేష్ చేపట్టిన 'శంఖారావం' కార్యక్రమం విజయనగరంలో ఈ నెల 16న జరగనుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో పాటు, కుటుంబ సారథులు, టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విజయనగరంలో ఈ నెల 16న నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పార్టీ నాయ కులు విజ్జపు ప్రసాద్, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, కంది సాయిజగ్గారావు, కంది మురళీనాయుడు, అను రాధ బేగం తదితరులు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** ఎల్‌.కోట మండలంలో ఈ నెల 17న నారా లోకేష్ చేపడుతున్న శంఖారావం సభ ను విజయవంతం చేసేందుకు కోళ్ల కుటుంబం కసరత్తు ముమ్మరం చే స్తోంది. ఇందులో భాగంగా లలితకుమారి నివాసం వద్ద మంగళవారం 5 మండలాల ముఖ్య నేతలు, కార్యకర్తలతో మండలాల వారీగా సమావేశమయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. యూనిట్లు, క్లష్టర్లు, బూత్‌ల వారిగా జన సమీకరణ చేపట్టడంపై నేతలతో చర్చించారు. మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, జక్కాన కన్నబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ● **శృంగవరపుకోట:** లక్కవరపుకోట మండ లం సోంపురం కూడలిలో ఈనెల 17న జరగనున్న నారా లోకేష్ శంఖా రావం సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి రావాలని నియోజకవర్గ ఇన్‌చార్జీ కోళ్ల లలిత కుమారి కోరారు. మంగళ వారం శృంగవరపుకోట శ్రీదారగంగమ్మ ఫంక్షన్ హాల్లో కార్యకర్తలతో స మావేశమయ్యారు. యువగళం పాదయాత్రతో వైసీపీ పతనం ప్రారంభ మైందని, ఇప్పుడు ఈ శంఖారావాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు కొణదం మల్లేశ్వరరావు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, కాపుగంటి వాసు, భీశెట్టి అరుణ, కనిశెట్టి ఈశ్వరరావు తదితరులున్నారు. ● **శృంగవరపుకోట:** లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలో ఈనెల 17న జరగనున్న నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం శృంగవరపుకోట గాయత్రీ దేవి ఆలయం వెనకున్న కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సభకు పార్టీ నాయకు లు, కార్యకర్తలు, అభిమానులు అధికంగా తరలిరావాలని కోరారు. రాయవరపు చంద్రశేఖర్, గోరపల్లి రాము, లగుడు రవికు మార్, గుమ్మడి భారతి, నాయకులు జనపరెడ్డి ఈశ్వరరావు, జుత్తాడ రామసత్యం, మంగరాజు తదితరులున్నారు. ● **కొత్తవలస:** నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోళ్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం మండల ప్రధాన కార్యదర్శి కనకాల శివ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీకి ఎస్‌కోట నియోజకవర్గం కంచుకోట వంటిదని, అలాంటి చోట మళ్లీ పార్టీ పాగా వేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టించి పనిచేయాలని, ఈ సభను విజయవంతం చేయాలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నాయకులు ఎల్లపు సూరిబాబు, పీవీ రత్నాజీ, కోళ్లవెంకటరమణ,బొబ్బిలి అప్పారావు, బంగారు రమేష్, కొరుపోలు అప్పారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మెరకముడిదాం: చీపురుపల్లిలో జరగనున్న శంఖారావం సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున కోరారు. మెరకముడిదాం పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారా లోకేష్ తల పెట్టిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలంతా భాగస్వాములు కావాలన్నారు. పార్టీ నాయకులు తాడ్డె సన్యాసినాయుడు, కెంగువ ధనుంజయ్, పి.సీతా రామరాజు, పిన్నింటి సన్యాసినాయుడు, చల్లా శ్రీరాం, పైడన్న ఆనంద్, రామకృష్ణ, రామకృష్ణరాజు, చంద్రరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: సోమరాజుపేట-గుళ్లసీతారాంపురం రోడ్డులో మంగళవారం నిర్వహించిన ఎన్నికల సోదాల్లో ఒక వ్యక్తి నుంచి 27 మద్యం సీసాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు సంతకవిటి మండలం గుళ్ల సీతారాంపురంలో బెల్టుషాపు కోసం మద్యం అక్రమంగా తరలిస్తుండగా మార్గమధ్యలో పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీలో ఏఎస్ఐ రాజారావు, సిబ్బంది ఉన్నారు. ● **లక్కవరపుకోట:** మండలంలోని రేగ గ్రామానికి చెందిన కేఎస్ఎన్.మూర్తి వద్ద 120 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలి పారు. అక్రమంగా మద్యం అమ్ముతుండగా సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు చెప్పారు. అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అగ్నిప్రమాదంలో టిఫిన్ దుకాణం దగ్ధం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 13: తిమిడి గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆకుల సంతోష్ టిఫిన్ దుకాణం అగ్నికి ఆహుతైంది. సాయంత్రం గ్రామస్థులందరూ సమీపంలో ఉండగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దుకాణం వెనుక భాగంలో చెరువు ఉండటంతో ప్రజలు నీటిని తెచ్చి మంటలు అదుపు చేశారు. గ్రామ యువజన సంఘ నాయకుడు ఒబ్బిన సతీష్ మాట్లాడుతూ నిరుపేద అయిన సంతోష్‌ను ఆదుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ఈ ఘటనలో నారాయణకు చెందిన లగేజీ ఆటో కూడా దగ్ధమైంది.


అగ్నికి ఆహుతవుతున్న టిఫిన్ దుకాణం

ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొన్న ఆటో

● ఇద్దరికి తీవ్ర గాయాలు

రాజాం రూరల్, ఫిబ్రవరి 13: రోడ్డు పక్కనే ఆగి ఉన్న మినీవేన్‌ను ఎదురుగా వచ్చిన ఆటో బలంగా ఢీకొన్న ఘటనలో వ్యాన్ వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన రాజాం-బొబ్బిలి రోడ్‌లో గ్యాస్ ఏజెన్సీ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ఉద్దేశంతో ప్రమాదస్థలం నుంచి 108 వాహనానికి కాల్ చేసినా సుమారు 30 నిమిషాల వరకూ వాహనం వచ్చే అవకాశాలు లేవని 108 ప్రధాన కేంద్రం నుంచి పేర్కొనడంతో అటుగా వెళ్తున్న తెదేపా నాయకుడు, ఒమ్మి సర్పంచి వంగా వెంకటరావు తన సొంత వాహనంలో క్షతగాత్రుల్ని ఆసుపత్రికి తరలించారు. లోకేష్ పర్యటన సందర్భంగా మినీ వ్యాన్‌తో హోర్డింగ్‌లు తీసుకువచ్చి రోడ్డు పక్కనే ఒమ్మి గ్రామానికి చెందిన గండి సూర్యారావు, బవిరిశెట్టి రంగారావులను పాతుతున్నారు. ఈ సమయంలో కంచరాం నుంచి రాజాం వైపు వస్తున్న ఆటో రోడ్డుపక్కనే నిలిపివేసి ఉన్న మినీ వ్యాన్‌ను, అక్కడే ఉన్న కూలీలను ఢీకొంది. ఘటనలో ఆటో డ్రైవర్ సైతం గాయపడ్డాడు. రాజాం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆటో డ్రైవర్‌పై ఫిర్యాదు చేయనున్నట్లు ఒమ్మి సర్పంచి వంగా వెంకటరావు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

రాజాం రూరల్: స్థానిక మెయిన్ రోడ్‌లో చాకలి వీధి జంక్షన్ వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని పట్టణంలోని ఈశ్వర నారాయణ కాలనీకి చెందిన సత్యనారాయణ తీవ్ర గాయాల పాలయ్యాడు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనపై ఏఎస్ఐ భాస్కరరావు కేసు నమోదు చేశారు.

అక్రమంగా పశువుల తరలింపు

కొత్తవలస, ఫిబ్రవరి 13: అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. చింతల దిమ్మ వద్ద వాహనాలను మంగళవారం తనిఖీ చేస్తుండగా విజయనగరం వైపు నుంచి కొత్తవలస వైపు రెండు వాహానాలలో అక్రమంగా తరలిస్తున్న 23 పశువులను గుర్తించినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

అమృత్ భారత్ పనుల తనిఖీ

కొత్తవలస, ఫిబ్రవరి 13: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ భారత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధిలో భాగంగా కొత్తవలస రైల్వేస్టేషన్‌లో ఆధునీకరణ పనులను విశాఖపట్టణం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తవలస రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ రైల్వేస్టేషన్‌గా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. దీని కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లు కేటాయించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్లాట్‌ఫారాలు, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేస్తున్నట్టు తెలిపారు. రైల్వేస్టేషన్‌కు మరో ప్రవేశద్వారం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ స్టేషన్‌లో వివిధ రైళ్ల నిలుపుదల కోసం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అమృత్ భారత్ పనులను ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసి వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు.


రైల్వే స్టేషన్‌లో పనులపై అడిగి తెలుసుకుంటున్న డీఆర్ఎం

బాల్య వివాహాలపై కళా ప్రదర్శన

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో మంగళవారం రాత్రి ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో కళాకారులు బుర్రకథ ప్రదర్శన నిర్వహించారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కళాప్రదర్శన ద్వారా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. బుర్రకథను గ్రామస్థులు ఆసక్తిగా తిలకించారు. ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ పువ్వల మాధవరావు, ఎంపీటీసీ శంకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శారదకు ఉత్తమ సేవా పురస్కారం

బొబ్బిలి: పట్టణానికి చెందిన సౌత్ ఇండియా డబ్ల్యుహెచ్‌ఆర్‌సీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ చింతా శారదకు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవా పురస్కారాన్ని స్వీకరించారు. రైల్వే కోడూరులోని శ్రీ గంగమ్మతల్లి బత్యాలభవన్‌లో సోమవారం నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌లో ఆమె ఈ అవార్డును అందుకున్నారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎంఆర్ అన్సారి, ఎం.అన్వర్, రాష్ట్రఅధ్యక్షుడు షఫ్రక్ మస్తాన్ సాహెబ్, సౌత్‌ఇండియా అధ్యక్షుడు షేక్ షాజహాన్ తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. అవార్డు అందుకున్న ఆమెను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.

వాయిదా పడిన ఆసరా నాలుగో విడత పంపిణీ

సీఎం వద్దకు చేరిన ఎస్‌కోట వైసీపీ పంచాయితీ?

శృంగవరపుకోట, ఫిబ్రవరి 13: శృంగవరపుకోట ఆకుల డిపో వద్ద మంగళవారం నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సిద్ధపడ్డారు. ఇందుకు అవసరమగు సభా వేదిక, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు కూర్చొనేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దాదాపు 10 వేల మందిని సమీకరించడంతో పాటు భోజనాల ఏర్పాటుకు అవసరమగు చర్యలు తీసుకున్నారు. ఇంతలో ఏమైంది ఏమో కాని సోమవారం రాత్రి 8గంటల సమయంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి మంగళవారం మధ్యాహ్నం తదుపరి తేదీని తెలియజేస్తామని సమాచారం పంపించారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబులను జిల్లా పార్టీ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హుటాహుటీన సీఎం జగన్మోహన్ రెడ్డి వద్దకు తీసుకెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్‌లో మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు సీఎం వద్ద శృంగవరపుకోట ఎమ్మెల్యే టిక్కెట్ పంచాయితీ జరిగినట్లు సమాచారం. సీఎంను కలిసిన అనంతరం బుధవారం ఉదయం 10 గంటలకు ఎస్‌.కోట మండల ఆసరా నాలుగో విడత పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుల మధ్య జరుగుతున్న వివాదంతో ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ వాయిదా పడినట్లు ఇరువర్గాల కార్యకర్తలు బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎంవో కార్యాలయం నుంచి పిలుపురావడంతో ఈ ఇద్దరు ప్రజా ప్రతినిధులతో పాటు కొప్పలవెలమ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు హుటాహుటీన తాడేపల్లికు చేరుకోవడం స్థానికంగా చర్చకు దారి తీసింది.


ఎస్‌.కోటలో మంగళవారం ఆసరా కార్యక్రమం కోసం చేసిన ఏర్పాట్లు

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 13: పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పువ్వులతో అమ్మ వారిని అలంకరించారు. మంగళవారం పైడి మాంబకు ప్రీతిపాత్రమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించారు. పండ్లను నైవేద్యంగా సమర్పించారు.


పైడిమాంబకు ప్రత్యేకాలంకరణ

మా ఓటు చంద్రబాబుకే

విజయనగరం రూరల్: కొత్తగా ఓటు హక్కు పొందిన పలువురు యువ ఓటర్లు రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కుని శతశాతం వినియోగించుకుంటామని, తమ ఓటును నారా చంద్రబాబు నాయుడు కోసం తెలుగుదేశం పార్టీకి వేస్తామని మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. 'మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్' పేరిట కొత్త కార్యక్రమాన్ని అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ ఓటర్లు మాధురి, గంటా ప్రదీప్, కిలారి గణేష్, తలచిట్ల సునీల్ తదితరులు మాట్లాడారు. యువ ఓటర్లు అంతా చంద్రబాబుకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

తాటిపాడులో పశువైద్య శిబిరం

రేగిడి, ఫిబ్రవరి 13: తాటిపాడు గ్రామంలో జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం, పొగాకు, మద్యపానం దుష్ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ పీఏఎస్ బాబూరావు, పశువైద్యాధికారి దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కేవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

17న జాతరకు ముహూర్తపు రాట

రాజాం/రూరల్, ఫిబ్రవరి 13: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు.. రాజాంలోని శ్రీపోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల మూహుర్తపు రాట ఈనెల 17న ఉదయం 9.45 గంటలకు వేయనున్నట్టు ఈవో బీవీ మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. అనువంశిక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. మార్చి 17, 18, 19 తేదీల్లో జాతర మహోత్సవాలు జరుగుతాయన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలోని పేదలకు మంగళవారం గాంధీస్మారక నిధి సభ్యులు వస్త్రదానం చేశారు. పాతబొబ్బిలి దయగల గోడ నుంచి సేకరించిన బట్టలను అన్ని వయస్సుల వారికి అందజేశారు. కార్య క్రమంలో విజయమో హన్, అప్పలనాయుడు, కృష్ణదాసు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో విద్యార్థుల ప్రతిభ

కలెక్టరేట్: జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో విజయనగరం పట్టణంకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో జిల్లా కేంద్రంకు చెందిన దనుకొండ శ్రీనిధి, చింతల తేజస్వీమనోజ్ఞ మంచి ప్రతిభ చూపించారు. గత నెల 24 నుంచి 30 తేది వరకూ జేఈఈ మెయిన్ జనవరి సెషన్ పరీక్షలు జరిగాయి. ఈ ఫలితాల్లో విజయనగరం పట్టణంలోని ఫూలబాగ్ కాలనీ చెందిన దనుకొండ శ్రీనిధికి 99.990 పర్సెంటైల్ సాధించిగా . అలాగే కాళీఘట్ కాలనీకి చెందిన చింతత తేజస్వి మనోజ్ఞకు 99.974 పర్సెంటైల్ వచ్చింది. ఈ ప్రతిభ సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు అభినందించారు

'తైక్వాండో' జనరల్ సెక్రటరీగా ప్రకాశరావు

కొత్తవలస: కంటకాపల్లి గ్రామానికి చెందిన ములపర్తి ప్రకాశరావును తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే తైక్వాండో ప్రకాశరావు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన విషయం తెలిసిందే.

పరాయి పంచన వ్యవసాయశాఖ కార్యాలయం

రాజాం రూరల్: రాజాం వ్యవసాయశాఖ ఏడీ కార్యాలయం పరాయిపంచన నిర్వహిస్తున్నారు. మెయిన్‌రోడ్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయం శిథిలం కావడంతో పట్టణానికి కిలోమీటర్ దూరంలోని మార్కెట్‌యార్డులో కార్యాలయాన్ని అయిదేళ్లగా కొనసాగిస్తున్నారు. దీంతో కార్యాలయానికి వెళ్లివచ్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదంతా ఒకెత్తు కాగా కార్యాలయం పట్టణానికి దూరంగా ఉండడంతో అధికారులు, దిగువస్థాయి సిబ్బంది ఎప్పుడు వస్తు న్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియని పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోట్లాది రూపాయలతో రైతాంగానికి భవన నిర్మాణాలు చేపట్టామని చెబుతున్న ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో రాజాంలో వ్యవసాయశాఖకు సొంత భవనం నిర్మించలేని నేతలను రైతులు విమర్శిస్తున్నారు.

లోకేష్ సభ ఏర్పాట్ల పరిశీలన

రాజాం: రాజాం పట్టణంలో పాలకొండ రోడ్డులో సీతారామ థియేటర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నారా లోకేష్ శంఖారావం కార్యక్రమం ఈనెల 15న నిర్వహి స్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ తెలిపారు. మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంఖారావం సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి వేల సంఖ్యలో టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మహిళలు, నిరుద్యోగ యువతీ యువకులు జనసైనికులు రావాలని కోరారు. కిమిడి అశోక్‌కుమార్, సు మల వెంకట మన్మథరావు, గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, తుప్పలపూడి శ్రీనివాసరావు, వంగా వెంకటరావు, దూబ ధర్మారావు, శాసపు రాజే ష్‌కుమార్, జరజాన నీలయ్య, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కోండ్రు, టీడీపీ నాయకులు

ఒక శాతం సెస్‌ను జమ చేయాలి: డీఆర్‌వో

కలెక్టరేట్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో జరిగే నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల్లో ఒక శాతం సెస్‌ను ప్రతి నెల నిర్మాణ మండలికి అందజేయాలని డీఆర్‌వో అనిత తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం భవన, ఇతర నిర్మాణ కార్మికులకు సంక్షేమ సెస్ చట్టం 1996పై సమీక్ష సమావేశం నిర్వహించారు. సెస్ వసూలుపై సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పలు నిర్మాణ పనులు చేపట్టే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ కింద ప్రభుత్వ, ప్రైవేటు భవన, ఇతర నిర్మాణాల మీద వచ్చే ఆదాయంలో ఒక శాతం మండలికి జమ చేయాలన్నారు. ఒక శాతం సెస్ వసూలుపై మండలికి కార్మిక శాఖ ప్రతి నెల నివేదికను మాన్యువల్‌గా పంపాలని చెప్పారు. ఒక శాతం సెస్ మండలి సక్రమంగా జమ చేస్తున్నారా లేదా నివేదికలు పంపుతున్నారా? అనే విషయాపై ఆరా తీశారు. కార్మిక శాఖ వారు రూపొందించిన ప్రొఫార్మాలో అన్ని శాఖలు సమాచారం అందజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ జీఎం పాపారావు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌వో అనిత

అశోక్‌ను కలిసిన రాంప్రసాద్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 13: టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజుని టీడీపీ బ్రాహ్మణ సాధికారిక కమిటీ కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మంగళవారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజుని కూడా కలిశారు. బ్రాహ్మణ సాధికారిక కమిటీ తరఫున జిల్లాలో పర్యటించి, రానున్న ఎన్నికల్లో బ్రాహ్మణుల మద్దతు టీడీపీకి లభించే విధంగా కృషి చేయనున్నట్టు ఆయన చెప్పారు.


అశోక్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాంప్రసాద్

పీవీఆర్‌కి అదితి గజపతిరాజు సంఘీభావం

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్రలో తెలగలను బీసీల్లో చేర్చాలని కోరుతూ తెలగ సంక్షేమ సంఘ నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు (పీవీఆర్) పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ పాదయాత్ర మంగళవారం ఉదయం 9 గంటలకు కోట జంక్షన్‌కు చేరుకుంది. టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు, తెలగ సంక్షేమ సంఘ నాయకులు పీవీఆర్‌కు సంఘీభావం తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు దీక్షా కంకణాలు

● కోమటిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో వినూత్న కార్యక్రమం

బొబ్బిలి, ఫిబ్రవరి 13: ఈ ఏడాది పదో తరగతి విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, ఏకాగ్రత, పట్టుదల పెరగాలన్న సంకల్పంతో కోమటిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులందరూ దీక్షా కంకణాలు కట్టుకునేలా ఉపాధ్యాయులు ప్రేరణ కలిగించారు. రానున్న పరీక్షల్లో తామంతా సఫలీకృతం కావాలని... చదువులతల్లి ప్రసన్నం పొందాలని కోరుకుంటూ ఈ కంకణాలు కట్టుకున్నారు. మ్యాథ్స్ టీచరు దాసరి వెంకటనాయుడు మదిలో మెదిలిన ఈ ఆలోచనను సహచర ఉపాధ్యాయుల సహకారంతో అమలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.శివన్నా రాయణ, ఉపాధ్యాయులు వినోదిని, ఉమామహేశ్వరరావు, వెంకటరమణ, సత్య వతి, చంద్రశేఖర్, పీడీ రాజేశ్వరి, పవన్‌కుమార్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.


దీక్షా కంకణాలు కట్టుకుంటున్న విద్యార్థులు

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

శృంగవరపుకోట, ఫిబ్రవరి 13: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు కె.వాసుదేవరావు, రేచర్ల శ్రీలక్ష్మి, వలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

విద్యపై ఖర్చుకు ప్రాధాన్యం

● మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 13: ప్రభుత్వం విద్యపై విస్తృతంగా ఖర్చు చేస్తోందని... ఇది భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా ఉంటుందని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. జేఎన్‌టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు బాలికల వసతి భవనాలు, సివిల్, మెటాలర్జీ ల్యాబ్‌లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ఉన్నత విద్యలో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఎడిక్స్ సంస్థ ద్వారా రెండు వేల ఆన్‌లైన్ కోర్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభించనున్నాయన్నారు. రాష్ట్రంలో తొలి దశలో 40 వేల మందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపల్ శ్రీకుమార్, అధ్యాపకులు ఆర్.గురునాథ్, బి.రాజేష్, డి.వెంకటరావు, ఎం.శశి తదితరులు పాల్గొన్నారు.


నూతన భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స

ద్రవ రూప యూరియాతో మేలు

విజయనగరం రూరల్: రైతులు తమ పంటలకు ద్రవరూప యూరియాను ఉపయోగించడం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుందని వ్యవసాయ శాఖ జేడీ రామారావు చెప్పారు. ఇఫ్కో ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక హోటల్‌లో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన శాఖాధికారి జమదగ్ని మాట్లాడుతూ కాలానికి అనుగు ణంగా రైతులు మారాలన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం విమల, ఇఫ్కో ప్రతినిధి జగదీష్ ఉన్నారు.

నేటి నుంచి ఉద్యమ బరిలోకి..

● ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ పిలుపు

బొబ్బిలి, ఫిబ్రవరి 13: ఉద్యమకార్యాచరణను విజయవంతం చేద్దామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్‌దారుల తాలూకా యూనిట్ జేఏసీ ఛైర్మన్ జి.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పలు సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జేఏసీ మంత్రివర్గంతో జరిపిన చర్చల్లో ఎటువంటి పురోగతి లేని కారణంగా రాష్ట్ర జేఏసీ ఉద్యమ కార్యాచరణకు పిలుపునిచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14 న తహశీల్దారులకు మెమొరాండంలు అందివ్వాలన్నారు. 15, 16 తేదీలలో భోజన విరామ సమయంలో నిరసన, 17 న ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాలన్నిటినీ విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జేఏసీ కార్యదర్శి రామారావు, ఉపాధ్యాయ, ఎన్‌జీఓ సంఘాల నాయకులు జేసీ రాజు, విజయగౌరి, ధనుంజయరావు, వెంకటనాయుడు, చుక్క శ్రీను, సత్యారావు, వెంకటరావు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నాయకులు

ఆటోల సమ్మెను జయప్రదం చేయాలి

రామభద్రపురం, ఫిబ్రవరి 13: ఆటో కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు రామభద్రపురంలో మంగళవారం ఆటో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఆటోలపై రూ.5,300 వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ భారాన్ని వైసీపీ ప్రభుత్వం వేసిందని, దీని వల్ల కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పాలనే దుర్మార్గమైన ఆలోచనలతో ప్రభుత్వాలు వ్యవహరించడం శోచనీయమన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 16న సమ్మె నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో రామభద్రపురం ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చొక్కాపు లోకేష్, వైస్ ప్రెసిడెంట్ కె.ఎ. సంజీవరావు, సాలూరు స్టాండ్ ప్రెసిడెంట్ కె.వెంకటరావు, బాడంగి ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.


రామభద్రపురంలో ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

గేటు పడితే నరకమే

- మెంటాడ రైల్వే గేటు వద్ద నిలిచిపోతున్న వాహనాలు
- గంటల కొద్దీ నిరీక్షణ
- సంతకాల సేకరణకే పరిమితమైన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి

గజపతినగరం, ఫిబ్రవరి 13: స్థానిక మెంటాడ రైల్వే గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు పడితే ఇరు వైపులా గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. గజపతినగరం నుంచి మెంటాడ మండలానికి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయాల్లో రైల్వే గేటు పడితే గంటలపాటు నిరీక్షణే. అత్యవసర సమయాల్లో వెళ్లే 108 వాహనం ట్రాఫిక్‌లో నిలిచి పోవాల్సిందే. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. దీనికితోడు మూడో లైన్ నిర్మాణానికి ఏర్పాట్లు చురుగ్గా సాగడంతో రానున్న రోజుల్లో మరింత ట్రాఫిక్ పెరిగిపోతుందని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. గత టీడీపీ హయాంలో బ్రిడ్జి ఏర్పాటుకు పాలకులు చర్యలు తీసుకున్నారు. ఇందుకు స్థానికుల నుంచి సంతకాల సేకరణ చేపట్టి రైల్వే అధికారులకు ప్రణాళికలను రూపొందించారు. పనులు ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తికావస్తున్నా దీనిపై దృష్టి పెట్టక పోవడం శోచనీయమని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.


మెంటాడ గేటు వద్ద నిలిచిన ట్రాఫిక్

రైళ్లలో అక్రమ రవాణాపై నిఘా: డీఎస్పీ


రైల్వే పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ మోహనరావు

బొబ్బిలి: త్వరలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రైళ్లలో అక్రమ రవాణా జరగకుండా నిఘా పెట్టాలని రైల్వే పోలీసు సిబ్బందిని విశాఖ రైల్వే సబ్ డివిజనల్ పోలీసు అధికారి బి.మోహనరావు ఆదేశించారు. మంగళవారం ఆయన బొబ్బిలి రైల్వే ఔట్‌పోస్టు పోలీసు స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు, మద్యం, అక్రమ నగదు రవాణా కాకుండా పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట విశాఖ రైల్వే లైన్స్ సీఐ కె.వెంకటరావు, విజయనగరం జీఆర్‌పీఎస్ ఎస్‌ఐ వి.రవివర్మ తదితరులు ఉన్నారు.

హక్కులను ఖూనీ చేస్తున్న ప్రభుత్వం


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రమణమూర్తి

రాజాం: ప్రజాస్వామ్య హక్కులను ఖూనీ చేస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణమూర్తి అన్నారు. మంగళవారం సీపీఐ రాజాం నియోజకవర్గ సమితి సమావేశం స్థానిక కళావేదిక వద్ద నిర్వహించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమణమూర్తి మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో నిరుపేదలను దోచుకొనే ప్రభుత్వాలు ఉన్నాయని.. 2024 ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకొని వస్తానని చెప్పిన ప్రధాని మోదీ ప్రైవేట్, కార్పొరేట్ పెత్తందారులకు సహజ సంపదను అప్పజెప్పాడని ఆరోపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఇప్పుడు సిద్ధం పేరుతో ప్రచార బ్యానర్లతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఆరు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం దగ్గర తాకట్టు పెట్టడానికి సిద్ధమా? రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఓడించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బుగత, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగభూషణం పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎస్ .కనకరాజు, కార్యవర్గ సభ్యులుగా గంగారాం, కృష్ణ, అప్పారావు, దుర్గారావు, సత్యారావు తదితరులు ఎన్నికయ్యారు

రవాణా సమ్మెను విజయవంతం చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమణ

విజయనగరం దాసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త రవాణా సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. నగరంలోని కేఎల్‌పురం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రమాదకర క్రిమినల్ చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రవాణా రంగ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సెన్సార్ కెమెరాలతో ట్రాఫిక్ పోలీసులు విధించే చలానాలు కట్టాలంటే అప్పులు చేయక తప్పడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిటు నాయకులు కె సురేష్, వివిధ సంఘాల నేతలు రాములు, అక్బర్, శ్రీనివాసరావు, సూరిబాబు, వెంకట రమణ, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోను సస్పెండ్ చేయాలి


హెచ్‌డీటీకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

రామభద్రపురం: కొట్టక్కి వీఆర్వో అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హెచ్‌డీటీ సుబ్బారావుకు వినతిపత్రం ఇచ్చారు. భూస్వాములకు కొమ్ము కాస్తూ ఎన్నో అవినీతి పనులు చేస్తున్న వీఆర్వోపై విచారణ చేపట్టాలని అన్నారు. 2006లో ప్రభుత్వం కేటాయించిన డీ పట్టా భూములు కొంతమంది ఆక్రమించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తమకు, తమ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.జ్ఞానప్రసాద్, సీపీఐ నాయకులు బాయి రవణమ్మ, పురం అప్పారావు, లెంక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం హెచ్‌డీటీ సుబ్బారావు మాట్లాడుతూ వారి భూములకు రక్షణ కల్పించడమే కాకుండా దౌర్జన్యం చేసిన వారిపై 107 కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు.

ఓట్ల సవరణపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఈఆర్వో ప్రమీలాగాంధీ

గజపతినగరం: ఓట్ల జాబితాల్లో ఎక్కడ పొరపాట్లు ఉన్నా వాటిని సవరించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈఆర్వో ప్రమీలాగాంధీ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో సవరణలు చేపడుతున్నామని, గ్రామాల్లో రాజకీయ నాయకులు అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. మృతిచెందిన వారి ఓట్లు డబుల్ ఎంట్రీలు ఉన్నా ఆన్‌లైన్‌లో సవరిస్తామని చెప్పారు. గజపతినగరం మండలానికి 62 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ సతీష్, రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓపీఎస్ కోరుతూ పోస్ట్ కార్డు ఉద్యమం


పోస్టుకార్డులు చూపిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీపురుపల్లి: ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు. ఓపీఎస్‌ను పునరుద్ధరించే పార్టీకి తమ మద్దతు తెలియజేస్తామని వివిధ రాజకీయ పార్టీలకు లేఖలు రాశారు. యుటీఎఫ్ నాయకులు మంగళవారం కార్డులను పోస్టు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పలనాయుడు, శ్రీనివాస్, శ్రీనివాసరావు, వెంకటరావు, సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ అమలులో రాజీ వద్దు

గుర్ల: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం మెనూ అమలులో రాజీ పడొద్దని...నాణ్యతగా అందించాలని వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు సూచించారు. భూపాలపురం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణంలో మంత్రి విఫలం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి: చీపురుపల్లి ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేయడంలో మంత్రి బొత్స సత్యనారాయణ విఫలమయ్యారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విమర్శించారు. చీపురుపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం వద్ద ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో దీని కోసం రూ.రెండు కోట్లు మంజూరు చేశామన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు ఈ నిర్మాణాన్ని పట్టించుకోలేదన్నారు. మంత్రి ఈ నిర్మాణంపై దృష్టి పెట్టలేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారంలోకి రాబోతున్నాయని, తమ హయాంలో దీన్ని పూర్తి చేసి, క్రీడాకారులకు కానుకగా ఇస్తామని నాగార్జున తెలిపారు. ఆయన వెంట జనసేన ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, తెలుగుదేశం నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, సారేపాక సురేష్, గవిడి నాగరాజు, మీసాల శ్రీధర్, గడే సన్యాసప్పలనాయుడు, గంట్యాడ సత్యనారాయణ, దన్నాన సూరప్పనాయుడు, మోపాడ తేజేశ్వరరావు, మీసాల నవీన్ ఉన్నారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా టీడీపీ

గుర్ల: పేదల గుండెల్లో టీడీపీ చిరస్థాయిగా నిలిచిపోతుందని జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం రాత్రి పాలవలస గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీ రామారావు విగ్రహాన్ని, జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కు అన్ని విధాలుగా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్, తెలుగు దేశం పార్టీ మండల నాయకులు పి.అప్పలనాయుడు, కిలారి సూర్యనారా యణ, మండల అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్, గొర్లె రామునాయుడు, కనిమెరక కృష్ణ, టి.శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.మహేశ్వరరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు దుర్గాసి కోటేశ్వరరావు, నాగులపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: టీడీపీలో చేరిన వారితో అదితి

టీడీపీలో చేరికలు

విజయనగరం రూరల్: నగరంలోని 5వ డివిజన్, 47వ డివిజన్‌కు చెందిన పలువురు మంగళవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఐదో డివిజన్‌కు చెందిన చింతపల్లి గణేష్, కరగాన రాజశేఖర్, భాను సమక్షంలో 20 కుటుంబాల వారు టీడీపీ లో చేరారు. 47వ డివిజన్ చెందిన బంగారి విజయప్రసాద్, నీలాపు శ్రీను, బొగ్గు మోహన్‌తో పాటు 70 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ● విజయనగరం మండల పరిధిలోని చెల్లూరులో 'బాబు ష్యూరిటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, పి.రాజేష్‌వర్మ, చెల్లూరు గ్రామ టీడీపీ నాయకులు, సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **రాజాం:** శ్యాంపురం టీడీపీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఒమ్మి సర్పంచ్ వంగా వెంకటరావు సమక్షంలో వైసీపీని వీడి 25 ఎస్సీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కోండ్రు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు అవ్వడం తథ్యమ న్నారు. కార్యక్రమంలో శాసపు రాజేష్‌కుమార్, పొన్నాడ భీమేశ్వరరావు, మడ్డు హరి తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో బి.అప్పారావు. బొద్దూరు గణేష్, ఊడికల నారాయణ, లోపింటి రాంబాబు తదితర ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి.


రాజాం: పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళి

అప్రంటీస్ విధానాన్ని రద్దు చేయాలి


జీవో ప్రతులను తగలబెడుతున్న దృశ్యం

గరివిడి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రంటీస్ విధానాన్ని మళ్లీ తీసుకురావడం చాలా అన్యాయమని పలువురు అభ్యర్థులు గరివిడి యూటీఎఫ్ కార్యాలయం వద్ద జీవో నెం.12ను మంగళవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రతినిధులు డి.రాము, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎ.సత్యశ్రీనివాస్, గొర్లె సత్యవతి, జిల్లా గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాసరావు, మండల బాధ్యులు రవికుమార్, ఐక్య సత్యనారాయణ, బి.బంగార్రాజు, ఎం.రఘునాథరాజు, ఎ.కనకేశ్వరరావు, వరప్రసాద్, జీఆర్ఎల్ లావణ్య, నాగేశ్వరరావు, పి.ప్రకాష్, ఎంవీ రమణ, తదితరులు పాల్గొన్నారు. అప్రంటీస్ ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామ స్థాయిలోనే వైద్య సేవలు

- జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు


ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీలో రోగుల సమస్యను తెలుసుకుంటున్న డీఎంవో

జియ్యమ్మవలస: ప్రజారోగ్యం దృష్ట్యా గ్రామీణ స్థాయిలోనే అందుబాటులో ఉన్న వైద్య సేవలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా మలేరి యా అధికారి డా.టి.జగన్మోహనరావు అన్నారు. అల్లువాడ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా రోగులకు నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్య వివరాలు నమోదు రికార్డులను తనిఖీ చేసి, తగు సూచనలు చేశారు. అనంతరం ఆర్ఆర్‌బీ పురం పీహెచ్‌సీతో పాటు చినమేరంగి సీహెచ్‌సీలో ల్యాబ్ పరీక్షలు, ఓపీ వివరాలు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలను స్పష్టంగా తెలుసుకుని తగు చికిత్స అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షేత్ర స్థాయిలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు గుర్తిస్తే వెంటనే చికిత్స అందజేసి, వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శంకర్, జగదీష్, ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

నేరాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలి

పార్వతీపురం టౌన్: బ్యాంకుల్లో నేరాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలని సెంట్రల్ క్రైం స్టేషన్ మన్యం జిల్లా సీఐలు ఎం.అప్పారావు, సుధాకర్ కోరారు. మంగళవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టణంలోని అన్ని బ్యాంకు శాఖల మేనేజర్లతో సీసీఎస్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐలు మాట్లాడుతూ బ్యాంకు ఆవరణలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించా రు. బ్యాంకుల్లో నేరాలు జరగకుండా 24/7 భద్రతా గార్డులు నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఎస్‌ఐలు రమణారావు, రమణారెడ్డి, పీపీపీ టౌన్ ఎల్అండ్‌వో ఎస్‌ఐ రవీంద్రరాజు, సీసీఎస్ పీసీ ఉదయ్ పాల్గొన్నారు.

'ప్రయాణికులే మన దేవుళ్లు'

పార్వతీపురంటౌన్: 'మనందరికీ ప్రయాణికులే దేవుళ్లని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ జోన్-1 ఈడీ రవికుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటుచేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను తమ గమ్యస్థానాలను చేర్చడం డ్రైవర్లు, కండక్టర్ల బాధ్యత అన్నారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అనంతరం మాసోత్సవాలను పురస్కరించుకుని వివిధ పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ వేతనదారుల సంఖ్య పెంచాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర, సీతారాంపురం, కొంకడివరం పంచాయతీల్లో ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పనుల నిర్వహణపై అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, నూతన నిబంధనలు అమలు పర్చాలని ఆదేశించారు. పనుల ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వేతనదారుల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమయ్యే పనులకు ప్రాధాన్య ఇవ్వాలన్నారు. మస్టర్లలో వ్యత్యాసాలు ఉంటే సహించేది లేదన్నారు. ఈ పరిశీలనలో ఏపీవో ఎం.గౌరీనాథ్, టెక్నికల్ అసిస్టెంట్ పద్మావతి, క్షేత్ర సహాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గరుగుబిల్లి: మండలంలోని 25 పంచాయతీల పరిధిలోగల పోలింగ్ కేంద్రాల్లో అసౌకర్యం కలగకుండా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ కె.జయ తెలిపారు. మండలంలోని పిట్టలమెట్ట, సంతోషపురం, కొంకడివరం, సీతారాంపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి సంబంధించి 49 పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని చెప్పారు. పూర్తిస్థాయిలో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, తదితర సౌకర్యాలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. స్థానిక బీఎల్వోలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఈ పరిశీలనలో ఆర్ఐ మండంగి కృష్ణ, వీఆర్వో పి.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

సీహెచ్‌వోలను ఆశాలుగా మార్పు చేయాలి

సీతంపేట: కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని ఫిబ్రవరి 14, 15, 16 తేదీల్లో ఐటీడీఏల వద్ద సామూహిక నిరాహార దీక్షలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు 10వేల వేతనం పెంచాలని, లేనిపక్షంలో సామాజిక నిరాహార దీక్ష తీవ్రతరం చేస్తామని చెప్పారు. అనంతరం నిరవధిక దీక్ష సమ్మె నోటీసును ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మాలతి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.కాంతారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్, ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ సీహెచ్ రామమోహిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి 2024-25 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 1 నుంచి 31 వరకు అర్హులైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మిమ్స్ ఉద్యోగులకు సంఘీభావం

నెల్లిమర్ల: మిమ్స్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ గత కొన్ని రోజులుగా స్థానిక ఆర్‌వోపీ వద్ద నిరసన చేపడుతున్నారు. మంగళవారం వీరి దీక్షా శిబిరం వద్దకు సీఐటీయూ నాయకులు చేరుకుని, సంఘీభావం ప్రకటించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం పరిశీలన

నెల్లిమర్ల: పెదబూరాడపేటలో మంగళవారం నిర్వహించిన రెండో విడత ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎంహెచ్‌వో బి.భాస్కరరావు పరిశీలించారు. శిబిరంలో 383 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లాన అప్పయ్యమ్మ, తుమ్మలపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల పైడినాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల వితరణ

బొబ్బిలి: మెట్టవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ కాజా వేణుగోపాలరావు మోడల్ టెస్ట్ పేపర్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, హెచ్ఎం విశాలాక్షి, యూటీఎఫ్ నేతలు విజయగౌరి, ప్రసన్న కుమార్, శశిభూషణరావు, బత్తుల శ్రీనివాస్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి, కృష్ణదాసు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించండి


ఉపాధిపనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

జామి: ఉపాధి పనులు కోరిన వారికి వెంటనే జాబ్‌కార్డులు మంజూరుచేసి అవకాశం కల్పించాలని డ్వామా పీడీ ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం కుమారాం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజుకు రూ.272 గిట్టుబాటయ్యేలా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కిరణ్మయి పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ పరిశీలన

కురుపాం: దోమల వ్యాప్తి నివారణ కోసం స్థానిక కేజీబీవీలో నిర్వహించిన స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహన్‌రావు పర్యవేక్షించారు. హాస్టల్ లోపల గోడలు, సెల్ఫ్‌లు, సీలింగ్ ఇతర ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేసే తీరును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా, విద్యార్థులు జ్వరాలు బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఏసీఎం 5శాతం మందును ఫోకల్ స్ప్రేయింగ్ చేపడుతున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది చేపట్టిన రక్త పరీక్షల నమూనాలను పరిశీలించారు.